పేదల భూమి వద్ద నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

ఏపీఐసీసీ చైర్మన్

భూ కబ్జాను ఆపండి

భూ బాధితులకు అండగా సిపిఎం ఆందోళన

భూములకు సంబంధించిన వివరాలను కలెక్టర్ బసంత్‌కుమార్‌కు వివరిస్తున్న ఇంతియాజ్

ప్రజాశక్తి-గోరంట్ల

శ్రీ సత్యసాయి జిల్లా గోరంట్ల మండలం పాలసముద్రం గ్రామంలోని ఎరుకుల కులస్తులకు చెందిన డి పట్టా భూములను ఏపీఐసీసీ చైర్మన్ మొట్టు గోవిందరెడ్డి కబ్జా చేసి, అందులో వెంచర్లు వేస్తున్నాడని దీనిని అడ్డుకోవాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. పేదల భూమలను కబ్జా చేస్తున్న మెట్టు గోవిందరెడ్డిని అరెస్టు చేయాలని డిమాండ్ సిపిఎం నాయకులు శనివారం నాడు పాలసముద్రం గామంలోని పేదల భూమి వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.ఇంతియాజ్ మాట్లాడుతూ పాలసముద్రం గ్రామం హిందూపురం రోడ్డు వద్ద ఎరుకుల కులస్తులు 3.29 ఎకరాల భూమికి 1929లో డీ పొందారన్నారు. ఇందులో పంటలు కూడా సాగు చేసుకుంటున్నారని చెప్పారు. ఇటీవల ఈ భూమిలో ఏపీఐసీసీ చైర్మన్ మెట్టు గోవిందరెడ్డి ఆయన అనుచరులు దౌర్జన్యంగా రియల్ ఎస్టేట్ పనులు చేస్తున్నారన్నారు. పేదలు ఈ భూములు తమవని వారితో వారించినా వినిపించుకోకుండా దౌర్జన్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అమాయకులైన పేద కుటుంబాలకు చెందిన భూములను స్వయంగా ఏపీ ఐసీసీ చైర్మన్ గోవిందరెడ్డి తన అధికార బలంతో లాక్కోవడం దుర్మార్గం అన్నారు. పోలీసులు, అధికారులు కూడా వారికి సహకరిస్తూ పేదలకు అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భూ బాధితులకు అండగా ఉన్న సిపిఎం నాయకులపై సిఐ దౌర్జన్యం చేస్తూ, అక్రమ కేసులు బనాయించే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి తక్షణం ఈ కబ్జాను ఆపాలన్నారు.

కలెక్టర్ దృష్టికి సమస్య...

పేదల భూముల ఆక్రమణ విషయాన్ని సిపిఎం నాయకులు శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ బసంత్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. శనివారం ఉదయం గోరంట్లలో ఇళ్ల జగన్న కాలనీలను పరిశీలించేందుకు వచ్చిన ఆయన్ను సిపిఎం నాయకులు కలిశారు. భూమికి సంబంధించిన పూర్తి వివరాలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. పేదల భూమిని లాక్కోవడానికి ప్రయత్నిస్తున్న ఏపీఐసీసీ చైర్మన్ మెట్టు గోవింద్ రెడ్డిపై కేసు నమోదు చేయాలని కోరారు. భూ బాధితులకు న్యాయం జరగకుంటే కలెక్టరేట్ వరకు పాదయాత్ర చేపట్టి, ఆందోళన చేపడుతామని సిపిఎం నాయకులు కలెక్టర్‌కు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పెద్దన్న, నాయకులు రమేష్, ప్రవీణ్‌తో పాటు భూ బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

బోగస్ చీట్‌ఫండ్స్..!



- నిబంధనలకు విరుద్ధంగా చిట్టీల నిర్వహణ
- నమ్మించి మోసం చేస్తున్న కేటుగాళ్లు
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కోట్లాది రూపాయల వ్యాపారం

పేద, మధ్యతరగతి ప్రజలే బాధితులు

పది రూపాయలు వెనకేసుకుంటే భవిష్యత్తు అవసరాలకు ఉపయోగపడుతుంది అని చాలా మంది భావిస్తుంటారు. ముఖ్యంగా పేద, మధ్య తరగతి ప్రజలు ఇలా ఎక్కువగా ఆలోచిస్తుంటారు. ఇలాంటి వారంతా ఇతరుల వద్ద చిట్టీలు వేస్తూ డబ్బును పోగు చేసుకునే ప్రయత్నం చేస్తుంటారు. ఇలాంటి వారి బలహీనతను ఆసరగా చేసుకున్న కేటుగాళ్లు కోట్లాది రూపాయలు వసూలు చేసుకుని రాత్రికిరాత్రే పరారీ అవుతున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చిట్టీల పేరుతో మోసం అంటూ నిత్యం ఏదో ఒక చోట ఘటనలు వెలుగు చూస్తునే ఉన్నాయి.

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పట్టణం, పల్లె అన్న తేడా లేకుండా అన్ని ప్రాంతాల్లోనూ చిట్టీల నిర్వహణ జరుగుతోంది. కొందరు దీనినే ఉపాధి మార్గంగానూ ఎంచుకున్నారు. ఇలా రూ.1 లక్ష నుంచి రూ.కోటి రూపాయల వరకు కూడా జిల్లాలో చిట్టీలు జరుగుతున్నాయి. బడా ఫైనాన్షియర్లగా చెప్పుకునే వారు రూ.5 కోట్ల వరకు కూడా చిట్టీలు నిర్వహిస్తున్నట్లు సమాచారం. చిట్టీలు నిర్వహించే వారు ప్రారంభంలో డబ్బులను బాగానే ఇస్తారు. ఆ తరువాత పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేసుకుని ఉడాయిస్తున్నారు. అనంతపురం, కళ్యాణదుర్గం, ధర్మవరం, కదిరి తదితర ప్రాంతాల్లో ఇలాంటి ఘటనలు వెలుగుచూశాయి. మోసపోయిన బాధితులు న్యాయం చేయాలంటూ పోలీసు స్టేషన్లను ఆశ్రయిస్తున్నారు. ఈ విషయంలో పోలీసులు కూడా బాధితులకు ఎలాంటి న్యాయం చేయలేకపోతున్నారు. మోసం చేసిన వ్యక్తిని పట్టుకుని వచ్చినా అతను తన వద్ద డబ్బులు లేవని, తానూ మోసపోయాయని చెబుతున్నారు. దీంతో పోలీసులు కూడా చేసేది లేక కేసు నమోదు చేసి వదిలేస్తున్నారు. డబ్బులు కట్టిన వారికి మాత్రం ఒక్క రూపాయి వెనక్కు వచ్చే పరిస్థితి కన్పించడం లేదు.

అమలు కాని నిబంధనలు..

చిట్టీలు నిర్వహించాలనుకునే వారు ఖచ్చితంగా ప్రభుత్వం నిర్ధేశించిన నియమ నిబంధనలను పాటించాల్సి ఉంది. ఇందుకోసం చిట్‌ఫండ్స్ యాక్ట్ 1982 ఉంది. దీని ప్రకారం చిట్టీ నిర్వహణకు జిల్లా రిజిస్ట్రేషన్ శాఖ నుంచి అనుమతులు పొందాల్సి ఉంది. సంబంధిత శాఖ నుంచి లైసెన్స్ పొంది ఆర్‌బిఐ నిబంధనలకు లోబడే చిట్టీలను నిర్వహించాల్సి ఉంది. కొత్త గ్రూపును ప్రారంభించే ముందు దాని విలువకు అదనంగా 50 శాతం కలిపి రిజిస్ట్రేషన్ శాఖకు డిపాజిట్ చేయాలి. సభ్యుల పూర్తి వివరాలను రిజిస్ట్రేషన్ శాఖకు అప్పగించారు. అయితే చిట్టీల నిర్వాహకులు ఈ నిబంధనలు ఏవీ పాటించడం లేదు.

పెద్ద ఎత్తున మోసపోతున్న బాధితులు

బోగస్ నిర్వాహకుల వద్ద చిట్టీలు వేసిన పేద, మధ్య తరగతి ప్రజలు భారీగా నష్టపోతున్నారు. అనంతపురం, ధర్మవరం, కళ్యాణదుర్గం, తదితర ప్రాంతాల్లో చిట్టీల మోసాలు జరిగిన ఘటనలు ఉన్నాయి. ప్రజలు వారి సంపాదనలో కొంత మొత్తాన్ని ప్రతి నెలా కంతుల రూపంలో చిట్టీలకు చెల్లిస్తారు. పిల్లలు పెళ్లిళ్లు, చదువులు, ఇళ్ల నిర్మాణం తదితర వాటి కోసం డబ్బును ఆదా చేసుకునేందుకు చిట్టీలు వేస్తుంటారు. కంతులు పూర్తయ్యే సమయానికి నిర్వాహకులు బోర్డు తిప్పేస్తున్నారు. కొందరు మోసం చేసి అజ్ఞాతంలోకి వెళ్లిపోతుండగా, మరికొందరు తామూ నష్టపోయామని కావును డబ్బులు చెల్లించలేమంటూ చేతులేత్తేస్తున్నారు. ఇలాంటి సమయంలో బాధితులు పోలీసులను ఆశ్రయించిన పెద్దగా ఫలితం ఉండడం లేదు. సదరు మోసం చేసిన వ్యక్తిని పోలీసు స్టేషన్‌కు పిలిపించినా తన వద్ద ఒక్క పైసా లేదని, ఈ పరిస్థితుల్లో తాను డబ్బులు ఇవ్వలేనని చెబుతున్నారు. దీంతో పోలీసులు కూడా అతన్ని ఏమీ చేయలేక బాధితుల కోసం కేసు నమోదు చేసి వదిలేస్తున్నారు. పోలీసులు మాత్రం ఇలాంటి నకిలీ చిట్టీ వ్యాపారులను నమ్మి మోసపో వద్దంటూ హెచ్చరి స్తూనే ఉన్నారు. ప్రభుత్వ అనుమతులు ఉన్న వారి వద్ద మాత్రమే చిట్టీలు వేయాలని చెబుతున్నా ప్రజలు బోగస్ నిర్వాహకులను నమ్మి మోసపోతూనే ఉన్నారు.

మంత్రి ఉషాశ్రీచరణ్‌ను బర్తరఫ్ చేయాలి

కబ్జా భూముల పరిశీలనకు టిడిపి పిలుపు - భానుకోట రిసార్ట్ వద్ద ఉద్రిక్తత - టిడిపి నేతల అరెస్టు

బికె పార్థసారధిని అరెస్టు చేసి జీపులో తరలిస్తున్న పోలీసులు

ప్రజాశక్తి-కనగానపల్లి

భూకబ్జాలకు పాల్పడిన మంత్రి ఉషాశ్రీచరణ్‌ను వెంటనే మంత్రి పదవి నుంచి భర్తరఫ్ చేయాలని టిడిపి నాయకులు డిమాండ్‌చేశారు. ఈమేరకు మంత్రి ఉషాశ్రీ చరణ్ కబ్జా చేసిన భూముల పరిశీలనకు టిడిపి పిలుపునివ్వడంతో మండలంలోని బానుకోట వద్ద ఉన్న మంత్రి ఉషాశ్రీచరణ్ రిసార్ట్ వద్ద శనివారం ఉద్రిక్తత చోటు చేసుకుంది. మంత్రి ఉషాశ్రీచరణ్ సుజలాన్ గాలిమరల భూములతోపాటు, పేద రైతుల భూములను ఆక్రమించుకుందని ఆరోపిస్తూ టిడిపి జిల్లా అధ్యక్షుడు బి.కె.పార్థసారధి, టిడిపి రాష్ట్ర ఎస్‌సి సెల్ అధ్యక్షుడు ఎం.ఎస్‌రాజు మంత్రి రిసార్ట్ ముట్టడికి పిలుపునిచ్చారు. దీంతో ముట్టడికి బయలుదేరిన టిడిపి నాయకులు కనగానపల్లి పోలీసులు అడుగడుగునా అడ్డుకుంటున్నారు. ముఖ్యంగా భానుకోట వద్ద ఉన్న మంత్రి రిసార్ట్ వద్ద పోలీసులు భారీగా మోహరించారు. అంతేగాకుండా మంత్రికి మద్దతుగా వైసిపి శ్రేణులు భారీగా చేరుకున్నారు. ఈనేపథ్యంలో టిడిపి నాయకులు రిసార్ట్ ముట్టడికి వస్తుండటంతో ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. ముట్టడికి వెళ్తున్న టిడిపి జిల్లా అధ్యక్షుడు బికె పార్థసారధితోపాటు టిడిపి నేతలను కొండపల్లి వద్ద పోలీసులు అరెస్ట్ చేసి ఆత్మకూరు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అదేవిదంగా ద్విచక్రవాహనంలో వెళ్తున్న టిడిపి రాష్ట్ర ఎస్.సి సెల్ అధ్యక్షుడు ఎం.ఎస్.రాజును అడ్డుకుని అరెస్టు చేశారు.

అమరాపురం : రూ.కోట్ల విలువజేసే భూములను కబ్జా చేసిన జిల్లామంత్రి ఉషాశ్రీచరణ్ వెంటనే పదవికి రాజీనామా చేపట్టాలని మాజీ ఎమ్మెల్యే ఈరన్న డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలోని స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుత వైసిపి మంత్రులు, ఎమ్మెల్యేలు అవినీతి, అక్రమాల్లో మునిగి తేలుతున్నారని ఆరోపించారు. ముఖ్యంగా భూముల కబ్జాతోపాటు ఇసుక అక్రమ రవాణా చేస్తూ దండుకుంటున్నారన్నారు. కళ్యాణదుర్గం నియోజకవర్గం కంబదూరు మండలం నూతిమడుగు గ్రామంలో గత టిడిపి హయాంలో సుజలాన్ గుజరాత్ విండో పార్క్ లిమిటెడ్ కంపెనీకి దాదాపు 160 ఎకరాల భూమిని కొనుగోలు చేసినట్లు తెలిపారు. అయితే వైసిపి ప్రభుత్వం అధికారంలోకి ఇచ్చాక ఆ భూమిని జిల్లా మంత్రి ఉషాశ్రీచరణ్ కబ్జా చేశారని ఆరోపించారు. అభివృద్ధిని విస్మరించిన మంత్రులు కేవలం కబ్జాలు, అవినీతినే అడ్డాగా మార్చుకున్నారని ధ్వజమెత్తారు. కళ్యాణదుర్గంలో నెలకొన్న కబ్జా భూములను పరిశీలించేందుకు వెళు న్న టిడిపి నాయకులను ఎక్కడికక్కడ అరెస్టు చేయడం బాధాకరమన్నారు. కావున ప్రజలు కూడా ఆలోచించి వచ్చే ఎన్నికల్లో టిడిపి అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ప్రకాష్, నాగు, మంజునాథ్, దుబ్బన్న పాల్గొన్నారు.

మడకశిర : భూ కబ్జాకు పాల్పడిన జిల్లామంత్రి ఉషాశ్రీచరణ్‌ను వెంటనే మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి డిమాండ్ చేశారు. శనివారం బాలాజీనగర్‌లో ఉంటున్న పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మంత్రి పదవిలో హుందాగా వ్యవహరించాల్సిన ఉషాశ్రీచరణ్ భూకబ్జాకు పాల్పడం హేయమైన చర్య అన్నారు. దాదాపు రూ.30కోట్ల విలువజేసే భూమిని కబ్జా చేయడంతోపాటు తన భర్త పేరు మీద పవన విద్యుత్ కంపెనీకి చెందిన 160 ఎకరాల భూమిని కారుచౌకగా రిజిస్ట్రేషన్ చేయించడం బాధాకరమన్నారు. భూకబ్జాకు పాల్పడిన మంత్రి భేషరుతుగా ప్రజలకు క్షమాపణ చెప్పి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అంతేగాకుండా మంత్రి భూకబ్జాకు పాల్పడిన కంబదూరు మండలం నూతిమడుగుకు పార్టీ శ్రేణులతో కలిసి వెళ్లేందుకు సిద్ధం అవుతుండగా పోలీసులు హౌస్ అరెస్టు చేయడం బాధాకరమన్నారు. ఈ సమావేశంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్‌మూర్తి, జిల్లా మైనారిటీ అధ్యక్షుడు భక్తర్, పట్టణ అధ్యక్షుడు మనోహర్, మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, క్లస్టర్ ఇన్‌ఛార్జి కన్నా, జిల్లా నాయీ బ్రాహ్మణ అధ్యక్షుడు రామాంజనేయులు, నియోజకవర్గ డాక్టర్ సెల్ అధ్యక్షుడు కృష్ణమూర్తి, కృష్ణప్ప, నియోజకవర్గ బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి కంబలపల్లి శ్రీనివాస్, నియోజకవర్గ తెలుగు యువత ఉపాధ్యక్షుడు రవికుమార్, వెంకటాద్రి, రంగనాథ్, బద్రీ, దినేష్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌లేక నీటి తడులు లేకపోవడంతో ఎండిన వేరుశనగ పంట

- 6గంటలకు మించి రాని కరెంట్
- ఎండుతున్న పంటలు
- నష్టపోతున్న రైతులు

విద్యుత్ కో(వె)తలు

ప్రజాశక్తి-గుడిబండ

విద్యుత్ కోతలు రైతులకు కష్టాల వెతలను తెచ్చి పెడుతున్నాయి. వేళాపాలా లేని కోతలతో బోరుబావుల కింద సాగు చేసిన పంటలు ఎడిపోతున్నాయి. చేతికొచ్చిన పంటలు అందకుండా పోవడంతో రైతులు తీవ్ర నష్టాలను చవిచూస్తున్నారు. గత కొంతకాలంగా గుడిబండ మండలంలో నెలకొన్న ఈ విద్యుత్ సమస్యలు రైతుల జీవితాలను అప్పుల్లోకి నెట్టేస్తున్నాయి. గుడిబండ మండల వ్యాప్తంగా రాళ్లపల్లి, శంకరగల్లు, ఎస్.రాయాపురం, కొంకల్లు, కెఎన్.పల్లి, కరికెర, మందలపల్లి, సిసి.గిరి తదితర పంచాయతీల పరిధిలో వేలాది ఎకరాల్లో వేరుశనగ, మొక్కజొన్న, మిర్చి, వరి, వక్క, తమలపాకు, అరటి, మల్బరీ తదితర పంటలను రైతులు సాగు చేశారు. బోరుబావుల కింద సాగువుతున్న ఈ పంటలకు నీటి తడులు అత్యవసరం. నిబంధనల మేరకు వ్యవసాయానికి 9 గంటల విద్యుత్ ఇవ్వాల్సి ఉండగా మండలంలో ఆరు గంటలు మాత్రమే ఇస్తున్నారు. అది కూడా ఎప్పుడు వస్తోందో తెలియని పరిస్థితి నెలకొంది. సమయ పాలన లేకపోవడంతో కరెంటు ఎప్పుడు వస్తుందో.. ఎప్పుడు పోతుందో రైతులకు తెలియడం లేదు. అవసరమైన సమయంలో పంటలకు నీటితడులు అందక అవి ఎండిపోతున్నాయి. ఖరీఫ్ సీజన్లో పెట్టిన పంటలు వర్షాభావంతో చేతికందకుండా పోయాయి. దీంతో రైతులు రబీలో బోరుబావుల కింద సాగు చేసిన పంటలపై దృష్టి సారించారు. ఈ సీజన్‌లో అయినా పంటలు చేతికందుతాయని భావించిన రైతులకు విద్యుత్ కోతలతో నిరాశే మిగులుతోంది. నీళ్లులేక కళ్లేదుటే పంటలు ఎండిపోతున్నా ఏమీ చేయలేని స్థితిలో రైతులు ఉన్నారు. గుడిబండకు పక్కన ఉన్న మండలాల్లో తొమ్మిది గంటలు విద్యుత్ ఇస్తుండగా ఇక్కడ మాత్రం ఆరు గంటలు కూడా ఇవ్వడం లేదు. ఈ విషయంపై పలుమార్లు రైతులు విద్యుత్ అధికారులను సంప్రదించినా ప్రయోజనం లేకుండా ఉంది. విద్యుత్ అధికారులు స్పందించి తొమ్మిది గంటల విద్యుత్ ఇవ్వకుంటే ఈ సారి పూర్తిగా అప్పుల ఊబిలో కూరుకుపోవాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తొమ్మిది గంటల విద్యుత్ ఇవ్వాలి

ఖరీఫ్‌లో పంటలు చేతికందలేదు. దీంతో రబీలో బోరుబావి కింద వేరుశనగ పంటను సాగు చేశాను. పంట బాగా ఉంది. అయితే విద్యుత్ కోతలతో ప్రస్తుతం పంట ఎండదశకు చేరుకుంది. కనీసం ఆరుగంటలు కూడా విద్యుత్ ఇవ్వడంలేదు. ఇలా అయితే పూర్తిగా నష్టపోతాం. విద్యుత్ అధికారులు స్పందించి తొమ్మిది గంటల నాణ్యమైన విద్యుత్‌ను అందించి పంటలు ఎండిపోకుండా చూడాలి.

అనంతరాజు, కల్లురొప్పం గ్రామం.

విద్యుత్ కోత వాస్తవమే..

విశ్వనాథ్, విద్యుత్ ఎఇ.

గుడిబండ మండలంలో విద్యుత్ కోత వాస్తవమే. ఆరు గంటలు మాత్రమే విద్యుత్ సరఫరా అవుతోంది. మండల కేంద్రంలో విద్యుత్ సబ్‌స్టేషన్ లేని కారణంగా పక్కన ఉన్న మూడు సబ్‌స్టేషన్ల ద్వారా మండలానికి విద్యుత్ సరఫరా జరుగుతోంది. దీంతో విద్యుత్ లోడ్ ఎక్కువగా ఉంది. ఈ కారణంగా గుడిబండలో తొమ్మిది గంటల విద్యుత్ సరఫరాలో లోపం ఉంది. ఈ సమస్య పరిష్కారానికి అదనంగా మరో ఆరు విద్యుత్ సబ్ స్టేషన్‌ల ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. మొదటి దశలో రాళ్లపల్లి, హిరేతూర్పి గ్రామాలకు సబ్‌స్టేషన్లు మంజూరు అయ్యాయి. ఆ పనులు త్వరలోనే ప్రారంభించి ఆ పంచాయతీ పరిధిలోని రైతులకు తొమ్మిది గంటల పాటు విద్యుత్ సరఫరా చేస్తాం. మిగిలిన గ్రామాల్లో కూడా త్వరలోనే విద్యుత్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.

కేంద్ర మంత్రితో అవార్డు అందుకుంటున్న ముస్కాన్

డీ ఫార్మసీ ఉత్తీర్ణతలో 'పురం' విద్యార్థినికి పురస్కారం

హిందూపురం : హిందూపురం బాలికల పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థిని మహమ్మద్ ముస్కాన్‌బాను డి-ఫార్మసీలో 1100/1053 మార్కులు సాధించి జాతీయ స్థాయిలో ప్రథమ స్థానం సాధించింది. దీంతో శుక్రవారం మహారాష్ట్రలోని నాగపూర్‌లోని నాగపూర్ విశ్వవిద్యాలయంలో కేంద్ర మంత్రి నితిన్‌గడ్కరీ బానుకు కేకే జార్జ్ మెమోరియల్ జాతీయ అవార్డు అందించి అభినందించారు. సాధారణ ప్రభుత్వ కళాశాలలో విద్యను అభ్యసించి, జాతీయ స్థాయిలో ప్రథమ స్థానం రావాడం చాలా సంతోషంగా ఉందని విద్యార్థిని ముస్కాన్ బాను తెలిపింది.

కేసుల పరిష్కారానికి సహకరించండి

సన్నాహక మెగా లోక్ అదాలత్‌లో ఎడిజె శైలజ

పోలీస్ అధికారులతో సమావేశం నిర్వహిస్తున్న న్యాయమూర్తులు

ప్రజాశక్తి-హిందూపురం

కేసుల పరిష్కారానికి బ్యాంకర్లు, బీమా సంస్థలు, పోలీసులు, న్యాయవాదులతోపాటు అన్నివర్గాల వారు సహకరించాలని అదనపు జిల్లా జడ్జి శైలజ కోరారు. శనివారం స్థానిక ఎడిజె కోర్టు ఆవరణలో ఆయావర్గాలతో వేర్వేరుగా సన్నాహక మెగా లోక్ అదాలత్ నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ కేసులను సత్వరమే పరిష్కరించేందుకు ప్రతి మూడు నెలలకు ఒకసారి మెగా లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అన్ని వర్గాల అధికారులతో పాటు మీడియా కూడా తమ వంతు సహకారాన్ని అందించాలన్నారు. గతం కంటే అధికంగా ఈ మారు కేసుల పరిష్కారానికి బ్యాంకర్లు, బీమా సంస్థలు, పోలీసు శాఖ సహకరించాలన్నారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న సివిల్, చెక్ బౌన్స్ కేసులు, ప్రమాద బీమా కేసులు తదితర రాజి కాదగ్గ అన్ని రకాల కేసులను పరిష్కరించుకోవచ్చన్నారు. ఫిబ్రవరి 11న జరిగే మెగా లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో న్యాయమూర్తులు శ్రీధర్, స్పందన, రాజ్యలక్ష్మి, ఎపిపిలు ఇందాద్, నగేష్, ఎజిపి శ్రీనివాస్‌రెడ్డితో పాటు న్యాయవాదులు, వివిధ బ్యాంక్‌ల అధికారులు, సిఐలు, ఎస్‌ఐలు, బీమా సంస్థల అధికారులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలి

కలెక్టర్ బసంత్‌కుమార్

ప్రజాశక్తి-గోరంట్ల

మండలంలోని మల్లాపల్లి, జీనవాండ్లపల్లి సమీపంలో ఉన్న జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ బసంత్‌కుమార్ సూచించారు. ఈమేరకు శనివారం ఆయా కాలనీలను పరిశీలించి లబ్ధిదారులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు చేపట్టే లబ్ధిదారులకు అవగాహన కల్పించి త్వరగా పూరి చేయించేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. ముఖ్యంగా ఆయా కాలనీల్లో విద్యుత్, నీటి సౌకర్యం కల్పించాలని అధికారులకు ఆదేశించారు. ఒకవేళ ఇప్పటికీ పూర్తయిన ఇళ్లకు విద్యుత్ కనెక్షన్లు ఇవ్వాలని సూచించారు. మల్లాపల్లి లేఔట్‌లో 300 గృహాలు మంజూరు కాగా ఇప్పటివరకు 14 మాత్రమే పూర్తయ్యాయన్నారు. మరో 127 ఇళ్లు పునాదుల స్థాయి, 16 మంది లబ్ధిదారులు గోడల నిర్మాణం వరకూ, 50 మంది లబ్ధిదారులు టాప్ లెవల్ వరకూ పూర్తి చేశారని స్థానిక అధికారులు వివరించారు. జీనవాండ్లపల్లి లేఔట్‌లో 415 ఇళ్లుమంజూరుకాగా 160 మంది పునాదుల వరకు, 81 మంది గోడల వరకు, 66 మంది టాప్ వరకు, 22 మంది పూర్తిగా ఇళ్లు నిర్మించుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ పీడీ చంద్రమౌళి, డిఇ నాగరాజు, తహశీల్దార్ రంగనాయకులు, ఎంపిడిఒ రఘునాథ్‌గుప్తా, హౌసింగ్ ఎఇ జగదీష్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్న కేంద్రమంత్రి

పుట్టపర్తి అర్బన్ : శ్రీ సత్యసాయి బాబా మహాసమాధిని కేంద్ర సమాచార శాఖ సహాయ మంత్రి దేవన్ష్‌చౌహాన్ శనివారం దర్శించుకున్నారు. శుక్రవారం రాత్రి పొద్దుపోయిన తర్వాత మంత్రి బెంగళూరు నుంచి పుట్టపర్తికి చేరుకున్న ఆయన శాంతిభవన్‌లో బస చేసి శనివారం ఉదయం బాబా సమాధిని దర్శించుకున్నారు. ఈసందర్భంగా సత్యసాయి మేనేజింగ్ ట్రస్ట్ ఆర్‌జె రత్నాకర్, ట్రస్ట్ సభ్యులు స్వాగతం పలికారు. కలెక్టర్ బసంత్ కుమార్ పుష్పగుచ్ఛం అందించి మర్యాదపూర్వకంగా కలిశారు.

వ్యవసాయ పరికరాల సరఫరాకు టెండర్లు ఆహ్వానం

పుట్టపర్తి అర్బన్ : జిల్లాలో 2022 23 సంవత్సరానికి వైఎస్ఆర్ యంత్ర సేవా పథకం కింద రైతులకు వ్యవసాయ పరికరాలు తయారీ సరఫరా చేసేందుకు టెండర్లను ఆహ్వానిస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ టిఎస్ చేతన్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. పవర్ వీడర్లు, కోటా స్ప్రేయర్లు, ఆయిల్ ఇంజన్లు నీటి సరఫరా పైపులు సరఫరా చేసేందుకు అర్హత ఉన్న సంస్థలు ఈనెల 27న సాయంత్రం ఐదు గంటలలోపు జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయంలో కొటేషన్లు అందజేయాలని కోరారు.

స్కూల్ గేమ్స్ కరాటే పోటీలకు ఎంపిక

హిందూపురం : ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా శనివారం పట్టణంలోని ఎంజిఎం పాఠశాల ఆవరణంలో స్కూల్ గేమ్స్ కరాటే పోటీలకు కరాటే విద్యార్థులను పోటీలు నిర్వహించి ఎంపిక చేశారు. స్కూల్ గేమ్స్ అండర్ 14, 17 తో పాటు అండర్ 19 విభాగాల్లో బాలబాలికల ఎంపిక చేసి, ప్రతిభ కనబర్చిన వారిని జిల్లా జట్టుకు ఎంపిక చేయనున్నట్లు స్కూల్ గేమ్స్ సెక్రటరీ అంజన్న తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సామ్రాజ్యం, ఎంఇఒ గంగప్ప, ఉమ్మడి అనంతపురం జిల్లా పిఇటి, పీడీల అసోసియేషన్ అధ్యక్షులు మొర్రెడ్డియాదవ్, ఎంజిఎం పీడీ లోకేనాథ్, కరాటే మాస్టర్లు ఫైరోజ్, వివిధ పాఠశాలల పీడీలు పాల్గొన్నారు.

ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోండి

కదిరిటౌన్ : గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఆధార్ సేవలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపిపి అమర్నాథ్‌రెడ్డి కోరారు. ఈమేరకు శనివారం కదిరి మండలం రూరల్ మండలం ఎర్రదొడ్డి గ్రామ సచివాలయంలో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాన్ని ఎంపిపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్తులకు బయోమెట్రిక్ అప్‌డేట్, ఆధార్‌కు ఫోన్ నెంబర్ లింక్, పేరు మార్పులు, అడ్రెస్, పుట్టిన తేదీ మార్పు, చిన్న పిల్లలకు కొత్త ఆధార్ కార్డు చేయడం వంటి చేసుకోవాలని కోరారు.

ఉచిత వైద్యశిబిరం

రొద్దం : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో అనంతపురం కిమ్స్ సవేరా ఆసుపత్రి సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరాన్ని ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ ప్రారంభించారు. ఇందులో భాగంగా గుండె జబ్బులు సంబంధించి 290 మంది చికిత్స చేయించుకున్నారు. వీరితో 36 మందిని మెరుగైన వైద్యం కోసం సిఫార్సు చేశారు. ఈ శిబిరంలో ప్రభుత్వ ప్రాథమిక వైద్య నిపుణులు జగదీష్‌బాబు, ఫార్మాసిస్ట్ చరణ్ తేజ, ఎంపిపి చంద్రశేఖర్, సర్పంచి రూప, గుండె జబ్బుల వైద్య నిపుణులు నాగరాజు, రామ్‌కుమార్‌నాయక్, క్యాంప్ కోఆర్డినేటర్ నరసింహా, భావన, శిరీష, మంజుల, లోకేష్, మధు, సిద్దయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

చిలమత్తూరు విద్యార్థినికి జిల్లాస్థాయి ప్రథమ బహుమతి

చిలమత్తూరు : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని ఎన్.స్నేహ జిల్లాస్థాయిలో ప్రతిభ కనబరిచింది. వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ద్వారా ప్రభుత్వం గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షల నిషేధ చట్టంపై విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈపోటీల్లో స్నేహ ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతి కైవసం చేసుకుని రూ.10వేల బహుమతి పొందినట్లు ప్రధానోపాధ్యాయులు జయప్రద తెలిపారు. జిల్లాస్థాయిలో మొదటి స్థానాన్ని సాధించడం పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థినికి శిక్షణిచ్చిన సైన్స్ ఉపాధ్యాయులు అభినందించారు.

సచివాలయ ఉద్యోగుల ర్యాలీ

నల్లమాడ : మండల పరిధిలోని ఎర్రవంకపల్లి సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ మురళీమోహన్‌నాయక్‌పై అదే గ్రామానికి చెందిన వెంకటేష్‌నాయక్ దాడి చేసినందుకు నిరసనగా మండల పరిధిలోని సచివాలయ ఉద్యోగులు శనివారం మండల కేంద్రంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ ఉద్యోగిపై దాడికి యత్నించిన వ్యక్తిపై కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అలాగే సచివాలయ ఉద్యోగులకు పని ఒత్తిడి తగ్గించాలని, దాడులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని నినాదాలు చేశారు.

వికలాంగ విద్యార్థులకు వైద్య పరీక్షలు

కొత్తచెరువు : మండల కేంద్రంలోని ప్రాథమిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న వికలాంగ విద్యార్థులకు శనివారం వైద్యపరీక్షలు నిర్వహించారు. డిఇఒ మీనాక్షమ్మ ఆదేశాల మేరకు శనివారం జిల్లావ్యాప్తంగా వికలాంగ విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఇందులో భాగంగా స్థానిక పాఠశాలలో వైద్యపరీక్షలు నిర్వహించి ఆయురుచిని చికిత్స కోసం ఎంపిక చేసినట్లు వైద్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు ముకుందారెడ్డి, జోషి, ఆనంద్‌బాబు, హెచ్‌ఎం చెన్నకృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు శ్రీనివాసరెడ్డి, రామాంజనేయరెడ్డి, 11 మంది సిబ్బంది పాల్గొన్నారు.

రాజకీయ జాతరలు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఈ వారం అంతా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సంక్రాంతి శోభ కన్పించింది. బంధువులు, మిత్రులతో పండగను జరుపుకున్నారు. ఉద్యోగ, వ్యాపార నిమిత్తం వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారంతా వారి స్వగ్రామానికి వచ్చి మూడు రోజుల పాటు పండగను కుటుంబ సభ్యుల మధ్య జరుపుకున్నారు. ఇదే సమయంలో రాజకీయ నేతలు పండుగను కూడా వారికి లబ్ది చేకూర్చేలా విధంగా మలుచుకున్నారు. పలు నియోజకవర్గాల్లో జాతరలు, విందులు పేరుతో ముఖ్య నాయకులు కార్యకర్తలు, మద్దతుదారులకు విందు భోజనాలు ఏర్పాటు చేశారు. రాప్తాడు, ధర్మవరం, పెనుకొండ, తాడిపత్రి, కళ్యాణదుర్గం తదితర ప్రాంతాల్లో 'రాజకీయ జాతరలు' జరిగాయి. ముఖ్యంగా అధికార పార్టీలో ఈ రకమైన జాతరలు కన్పించాయి. నియోజకవర్గ ముఖ్య నేతలే ఇందులో పాల్గొనడం విశేషం. మద్దతుదారులను మచ్చిక చేసుకోవడం తో పాటు, అసమ్మతి నేతలను దగ్గర చేసుకునేందుకు ముఖ్య నేతలు జాతరలను ఉపయోగించుకున్నారు. పెనుకొండ నియోజకవర్గంలో వైసిపి అసమ్మతి వర్గం ఓ విందును ఏర్పాటు చేసింది. పనిలోపనిగా స్థానిక ఎమ్మెల్యే పై అక్కడ అసమ్మతి గళం విన్పించినట్లు తెలుస్తోంది. భవిష్యత్తులో మనమందరం ఏకంగా ఉండి ఆ నేతకు సహకరించరాదని మాట్లాడుకున్నట్లు సమాచారం. ఇక రాప్తాడు నియోజకవర్గం ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి స్వగ్రామం తోపుదుర్తిలో బొంతల జాతరను ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ జాతరలో పెద్ద సంఖ్యలో నియోజకవర్గంలోని వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. వీరితో పాటు ఉమ్మడి జిల్లాకు చెందిన అధికారులు, ఎమ్మెల్యేలు విందులో పాల్గొన్నారు. గతంలో ఎన్నడూ లేనంతగా ఇక్కడ పెద్ద సంఖ్యలో జనాలను సమీకరించి అనుచరుల మద్దతు కూడగట్టే యత్నం వైసిపి నేతలు చేశారు. ఎన్నికల దగ్గర పడుతున్న నేపథ్యంలో వారి జనబలాన్ని ప్రదర్శించే పనిని చేపట్టారు. ధర్మవరంలో ప్రతి ఏటా మాదిరే సంక్రాంతిని పురస్కరించుకుని జోళ్ల మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ ఉత్సవంలో పెద్ద సంఖ్యలో రాజకీయ నేతలు పాల్గొన్నారు. ఆయా దేవాలయాల వద్ద పలు పార్టీల ముఖ్య నేతలు కుటుంబ సభ్యులతో సహా వెళ్లి స్థానికులను కలుసుకునే ప్రయత్నం చేశారు. ఇక కళ్యాణదుర్గం నియోజకవర్గంలో జరిగిన జాతరలో సైతం మంత్రి ఉషశ్రీచరణ్ పాల్గొన్నారు. ఇలా అధికార పార్టీ నేతలందరూ భవిష్యత్తు ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని సంక్రాంతి పండుగను రాజకీయ జాతరలతో బాగానే వినియోగించుకున్నారని చెప్పొచ్చు.

లాకప్‌డెత్ మిస్టరీ

రాయదుర్గం పట్టణం పోలీస్ స్టేషన్‌లో ఈ నెల 17వ తేదీన ఓ నిందితుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన తీవ్ర సంచలనం రేపింది. గొర్రెల దొంగతనం కేసులో పోలీసు స్టేషన్‌కు పట్టుకుని వచ్చిన నిందితుడు పోలీసు స్టేషన్‌లోనే లుంగీతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు చెబుతున్నారు. అయితే దీనిపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. పోలీసులు కొట్టి చంపారన్న విమర్శలు విన్పించాయి. అరెస్టు చేసిన నిందితుడిని లాకప్‌లో ఉంచకుండా కంప్యూటర్ గదిలో ఉంచడం, ఆత్మహత్య చేసుకునే సమయంలో మరో నిందితుడు పక్కనే ఉండడం, మృతుని కుటుంబ సభ్యులను కూడా ఈ మరణంపై మాట్లాడకుండా మౌనం వహించడం.. ఈ ఘటన ఎలా జరిగిందనే విషయాన్ని బయటకు పొక్కనివ్వకుండా పోలీసులు వ్యవహరించిన తీరుపై సర్వత్రా విమర్శలు విన్పిస్తున్నాయి. కాగ ఈ ఘటనకు బాధ్యులను చేస్తూ సిఐ, ఇద్దరు కానిస్టేబుళ్లు, ఓ హోంగార్డును జిల్లా ఎస్పీ ఫక్కీరప్ప సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. పోలీసు స్టేషన్‌లో జరిగిన ఈ ఘటనపై విచారణ కొనసాగుతోంది.

'దుర్గం'లో పొలిటికల్ వార్

కళ్యాణదుర్గంలో అధికార, ప్రతిపక్ష పార్టీ నేతల మధ్య పొలిటికల్ వార్ కొనసాగింది. స్థానిక ఎమ్మెల్యే, మంత్రి ఉషశ్రీచరణ్ భూ కబ్జాలకు పాల్పడ్డారంటూ టిడిపి నేతలు ఆరోపణలు చేశారు. కబ్జాలకు సంబంధించిన సాక్ష్యాధారాలను మీడియాకు చూపించారు. దీనిపై మంత్రి కూడా స్పందించారు. తనపై కావాలనే ఆరోపణలు చేస్తున్నారని, బిసి మంత్రిని అయినందునే ఇలాంటివి చేస్తున్నారంటూ టిడిపి నేతల ఆరోపణలను తిప్పకొట్టారు. ఇలా టిడిపి, వైసిపి నేతలు ఒకరిపై ఆరోపణలు, ప్రత్యారోపణలు, ఛాలెంజ్‌లు చేసుకున్నారు.

చంద్రబాబు కృషితోనే కియా పరిశ్రమ

మాజీ ఎంపి నిమ్మల కిష్టప్ప

ప్రజాశక్తి-పెనుకొండ

కియా పరిశ్రమ వద్ద సంబరాలు చేసుకుంటున్న టిడిపి నాయకులు

టిడిపి అధినేత చంద్రబాబు కృషితోనే పెనుకొండకు కియా పరిశ్రమ వచ్చిందని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎంపి నిమ్మల కిష్టప్ప, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవితమ్మ అన్నారు. కియా కంపెనీకి ఇండియన్ కార్ ఆఫ్ ది ఇయర్-2023 అవార్డు రావడం పట్ల శనివారం కియా వద్ద టిడిపి నాయకులు కేక్ కోసి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రబాబు దూరదృష్టి కారణంగానే మండలంలోని అమ్మవారిపల్లి సమీపంలో కియా పరిశ్రమ ఏర్పాటైందన్నారు. రాయలసీమలోని అత్యంత వెనుకబడిన ప్రాంతంలో కియా ప్లాంట్ ఏర్పాటు చేయడం ద్వారా అభివృద్ధి సాధ్యమని భావించి అనుమతి ఇచ్చారన్నారు. ఇందులో భాగంగా ప్లాంట్‌లో ఉత్పత్తి చేసిన కియాకరెన్స్ వేరియంట్ ద్వారా 'ఇండియన్ కార్ ఆఫ్ ది ఇయర్ 2023' అవార్డును గెలుచుకున్నందుకు కియా ఇండియాకు అభినందనలు తెలిపారు. ఇది ఆంధ్రప్రదేశ్‌కు గర్వకారణమన్నారు. ఈప్రాంతవాసులుగా తమకు ఎంతో గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి రామాంజనమ్మ, మాజీ జడ్పీటీసీ వెంకటరమణ, మాజీ సింగిల్‌విండో అధ్యక్షుడు డివి ఆంజినేయులు, మాజీ మండల కన్వీనర్ శ్రీరాములు, గుట్టూరు మాజీ సర్పంచి సూర్యనారాయణ, కురబవాండ్లపల్లి మాజీ సర్పంచి సోమశేఖర్, అడదాకులపల్లి మాజీ సర్పంచి ప్రసాద్, మాజీ ఎంపిపి నరసింహులు, నాయకులు త్రివేంద్రనాయుడు, బాబుల్‌రెడ్డి, కౌన్సిలర్ గీతా హనుమంతు, చిన్నపోతన్న, సుబ్రహ్మణ్యం, శ్రీనివాసులు, వీరన్న, హేమసుందర్‌రెడ్డి, వాసుదేవరెడ్డి, నారాయణస్వామి, కొండారెడ్డి, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

'గడప గడపకూ'లో నాయకులు

ప్రజాశక్తి-రొద్దం


ఎమ్మెల్యే శంకరనారాయణకు స్వాగతం పలుకుతున్న స్థానికులు

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే శంకరనారాయణ తెలిపారు. శనివారం మండలంలోని ఎం.కొత్తపల్లి, మోపర్లపల్లి గ్రామాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకోవడంతో పాటు ప్రభుత్వ పథకాలపై కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీనీ అమలు చేసిన ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందన్నారు. కావున మరోసారి జగన్‌ను ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ తిమ్మయ్య, ఎంపిపి చంద్రశేఖర్, ఎంపిటిసి వీరేష్, మండల నాయకులు, అధికారులు, పాల్గొన్నారు.

హిందూపురం : అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలన్న ఉద్దేశంతోనే సిఎం జగన్ గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం అమలు చేస్తున్నారని ఎమ్మెల్సీ షేక్ మహమ్మద్ ఇక్బాల్ అన్నారు. శనివారం హిందూపురం రూరల్ మండలం బేవినహళ్లి గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సమన్వయకర్త కొండూరు వేణుగోపాల్‌రెడ్డి, సర్పంచి ఆనంద్, వైస్ ఎంపిపి రఘునాథ్‌రెడ్డి, జడ్పిటిసి నాగభూషణ, మల్లేష్, గోళాపురం సర్పంచి దేవరాజ్, మలుగూరు ఎంపిటిసి ఏకాసప్ప, నాయకులు బసిరెడ్డి, పురుషోత్తంరెడ్డి, ఆనంద్‌రెడ్డి, సంతేబిదనూర్ రాము, మూర్తి, చాంద్‌బాషా, బసప్ప, సచివాలయ సిబ్బంది, సచివాలయ కన్వీనర్లు, అనుబంధ విభాగాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రథసప్తమి వేడుకలకు ఏర్పాట్లు

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు దాసెట్టి సుబ్రమణ్యం

పట్టణంలోని లక్ష్మీ చెన్నకేశవ స్వామి రథసప్తమి వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు దాసెట్టి సుబ్రహ్మణ్యం తెలిపారు. శనివారం స్థానిక ఆలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తిరుమలలో జరిగినట్లు ధర్మవరంలో మొట్టమొదటిసారిగా ఈనెల 28న రథసప్తమి వేడుకలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఒకేరోజు ఏడు వాహనాల్లో స్వామివారు భక్తులకు దర్శనమివ్వనున్నట్లు తెలిపారు. భక్తులు ఎవరూ టెంకాయలు కొట్టకూడదన్నారు. పలు సర్కిళ్లలో హారతి కోసం ఏర్పాట్లు చేస్తామని, అక్కడికి వచ్చి స్వామికి హారతి ఇవ్వవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ డైరెక్టర్లు అజంతా కృష్ణ, బండ్లపల్లి రంగనాథ్, అశ్వర్థనారాయణ, అన్నమయ్య సేవా మండలి అధ్యక్షుడు పోరాళ్ల పుల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఓంకారేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవ వేడుకలు

బత్తలపల్లి : మండల కేంద్రంలోని శ్రీలలితా త్రిపుర సుందరీ సమేతా ఓంకారేశ్వరస్వామి ఆలయ నాలగవ వార్షికోత్సవ వేడుకలు నేటి నుంచి ఘనంగా ప్రారంభం కానున్నట్లు ఆలయ శాశ్వత ధర్మకర్త, ఎపి కురుబ కార్పొరేషన్ ఛైర్మన్ కోటి సూర్యప్రకాష్‌బాబు, జెడ్పీటీసీ కోటి సుధ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓంకారేశ్వరుని ఆలయం నిర్మాణం పూర్తి చేసుకుని ప్రతిష్ట నిర్వహించి నాలుగేళ్లు పూర్తికావడంతో వేడుకలకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా నేడు ఆదివారం గంగపూజ, గణపతిపూజ, పుణ్యాహవచనం, రుత్విక్ వరణం, పంచగవ్యప్రాశన, నవగ్రహ ఆరాధన, అంకురార్పణ. మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం: నవగ్రహ, ధన్వంతరే, మృత్యుంజయ హోమాలు, అభిషేకాలు విశేషపూజలు ఉంటాయన్నారు. 23న సోమవారం పంచామృతాభిషేకం, రుద్రాభిషేకాలు, రుద్రహోమం, మన్యుసూక్త హోమం తదితర విశేష పూజలు ఉంటాయన్నారు. 24న మంగళవారం షోడషోపచారపూజలు, గణపతి, నవగ్రహ హోమం, 11 గంటల నుంచి శివపార్వతుల కళ్యాణోత్సవం ఉంటుందన్నారు. సాయంత్రం గ్రామోత్సవం, అన్నదానం అనంతరం రాత్రి 8 గంటలకు శివస్వాములకు భిక్ష ఉంటుందన్నారు. కావున భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

క్షణికావేశంలో తప్పులు చేయొద్దు..

సబ్‌జైలు తనిఖీలో న్యాయమూర్తి స్పందన

ప్రజాశక్తి-హిందూపురం

సబ్‌జైలును తనిఖీ చేస్తున్న న్యాయమూర్తి స్పందన

క్షణికావేశంలో తప్పులు చేసి జైళ్లకు రావద్దని జూనియర్ సివిల్ జడ్జి స్పందన సూచించారు. శనివారం స్థానిక సబ్‌జైలును ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా జైలులో ఉన్న ఖైదీల వివరాలను, ఏఏ కేసుల్లో నిందితులుగా ఉన్నారన్న వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జైలులో ఖైదీల కోసం తయారు చేసే ఆహార పదార్థాల కోసం ఉపయోగించే నిత్యావసరాలను పరిశీలించారు. నీటి నాణ్యత, జైలు గదులు, వైద్య సదుపాయం తదితరులను జైలర్ చంద్రశేఖర్‌తో అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తప్పుల మీద తప్పులు చేసి జైలుకు రావడం వల్ల కుటుంబాలు ఎన్నో అవమానాలకు గురికావాల్సి వస్తుందని ఖైదీలకు తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు సిద్ధూ, పార్వతి, లోక అదాలత్ శారద తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' పనుల పరిశీలన

కదిరిటౌన్ : కదిరి రూరల్ మండలం కుమ్మరవాండ్లపల్లి పంచాయతీలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఎంపిడిఒ సుధామణి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీలతో మాట్లాడుతూ సకాలంలో పనులకు హాజరై ఎక్కువ కూలి పడేవిధంగా పని చేయాలని సూచించారు. అలాగే పనుల్లో ఎలాంటి అవకతవకలకు పాల్పడరాదని సిబ్బందిని ఆదేశించారు.

ఇంటర్‌లో ఉత్తీర్ణత శాతం పెంచాలి

ధర్మవరం టౌన్ : ఈసారి ఇంటర్ పరీక్ష ఫలితాల్లో ఉత్తీర్ణత శాతం పెంచేందుకు అధ్యాపకులు కృషి చేయాలని ఉమ్మడి అనంతపురం జిల్లా ఆర్‌ఎస్‌ఐఒ సురేష్‌బాబు సూచించారు. శనివారం స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా ల్యాబ్‌తోపాటు రికార్డులను పరిశీలించారు. తర్వాత విద్యార్థినులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థినులు బాగా చదివి మంచి ఉత్తీర్ణత శాతం సాధించాలన్నారు. ముఖ్యంగా కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితే అనుకున్న లక్ష్యాన్ని సాధించవచ్చన్నారు. ఆ దిశగా విద్యార్థినులు కృషి చేయాలన్నారు.

క్యాలెండర్ల విడుదల

క్యాలెండర్లను విడుదల చేస్తున్న ముస్లిములు

ధర్మవరం టౌన్ : పట్టణంలోని మదరసా-ఏ-ఉలుమ్ ట్రస్టు సభ్యులు, మౌలానాసాబ్ ముస్లిముల క్యాలెండర్లను 10వ వార్డు టిడిపి ఇన్‌ఛార్జి కృష్ణాపురం, జమీర్ అహమ్మద్ ఆధ్వర్యంలో శనివారం జమీర్‌అహమ్మద్ స్వగృహంలో ఆవిష్కరించారు. ఈ క్యాలెండర్లు ప్రత్యేకంగా నమాజ్ టైమింగ్ కోసం ఎంతో ఉపయోగపడతాయన్నారు.

విద్యార్థులకు అభినందనలు

కొత్తచెరువు : అంతర్జాతీయ స్థాయి విజ్ఞాన శాస్త్ర పరీక్షల్లో ఐఎస్-ఎస్‌ఒ ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు మండల కేంద్రంలోని నారాయణ పాఠశాల సిబ్బంది అభినందించారు. ఈమేరకు శనివారం స్థానిక పాఠశాలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సిబ్బంది అభినందించారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ రెడ్డి హరిత, ఆర్ఐ గురుప్రసాద్, ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రెడ్డి, అధ్యాపకులు విజయ్, కావ్య, పల్లవి, తదితరులు పాల్గొన్నారు.

మట్టి తరలిస్తే చర్యలు

పరిగి : చెరువు నుంచిగానీ, ప్రయివేటు భూముల నుంచిగానీ అనుమతులు లేకుండా మట్టి తరలిస్తే కఠినంగా చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ సౌజన్య లక్ష్మి హెచ్చరించారు. మండల కేంద్రం నుంచి బీచిగానిపల్లి గ్రామానికి తహశీల్దార్ వస్తుండగా ఎర్రగుంట ప్రాంతం నుండి ఇటుకల బట్టి కోసం తరలిస్తున్న మట్టి ట్రాక్టర్లను గమణించి అపరాద రుసుం విధించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ అక్రమంగా మట్టి తరలించకుండా గ్రామస్థాయిలో పనిచేసే అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

26 నుంచి ఫ్లెక్సీ, బ్యానర్ల నిషేధం

ధర్మవరం టౌన్ : ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 26వ తేదీ నుంచి పట్టణంలో ప్లాస్టిక్, బ్యానర్లను నిషేధించినట్లు మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున తెలిపారు. ఈ మేరకు శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో పట్టణంలో ప్లాస్టిక్, బ్యానర్ల ఉత్పత్తిదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రభుత్వం ప్లాస్టిక్ ఫ్లెక్సీ, బ్యానర్లను నిషేధించినట్లు తెలిపారు. కావున ఎవరైనా ప్రభుత్వ ఆదేశాలను అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్‌పెక్టర్ మహబూబ్‌బాషా పాల్గొన్నారు.

యువగళం పాదయాత్రను విజయవంతం చేయాలి

పెనుకొండ : టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టనున్న యువగళం పాదయాత్రను విజయవంతం చేయాలని తెలుగు మహిళా జిల్లా అధ్యక్షురాలు సుబ్బరత్నమ్మ పిలుపునిచ్చారు. టిడిపి జిల్లా అధ్యక్షులు బికె.పార్థసారధి ఆదేశాల మేరకు సుబ్బరత్నమ్మ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని ఊరువాకిలి శ్రీఆంజనేయస్వామి ఆలయం, బాబయ్య స్వామి దర్గా, సిఎండ్ ఐజి చర్చిలో ప్రత్యేక పూజలు చేశారు.

నేరాలు ఘోరాలు

ఆర్టీసీ బస్సును ఢీకొన్న ఆటో..పలువురికి గాయాలు

ఆటోను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

హిందూపురం : పట్టణ పరిధిలోని కొట్నూరు వద్ద శనివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో పలువురు గాయపడ్డారు. హిందూపురం నుండి కదిరి వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సును ప్రయాణికులతో కగ్గల్లు నుంచి హిందూపురం వస్తున్న ఆటో ఢీకొంది. దీంతో ఆటో డ్రైవర్ సద్గురుడు, ప్రయాణికులు అనిల్, చౌడిరెడ్డి, సృజన్‌రెడ్డి గాయపడ్డారు. వెంటనే స్థానికులు క్షతగాత్రులను హిందూపురం జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనిల్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కాగా ప్రమాద విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్సీ షేక్ మొహమ్మద్ ఇక్బాల్ ఆసుపత్రికి వెళ్లి క్షతగాత్రులను పరామర్శించారు. అనంతరం ఆర్థికసాయం అందజేశారు.

వృద్ధుడు అదృశ్యం

ధర్మవరం టౌన్ : పట్టణంలో ఓ వృద్ధుడు అదృశ్యమైనట్లు టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో బాధితుడి మేనల్లుడు సోము శనివారం ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. సోమందేపల్లికి చెందిన ఆసితప్ప సంక్రాంతి పండుగకు ధర్మవరంలోని కొత్తపేటలో ఉన్న మేనల్లుడు సోము ఇంటికి వచ్చాడు. అయితే ఈనెల 18న ఇంటి నుంచి బయటకు వచ్చి ఇంటికి రాలేదన్నారు. పట్టణమంతా గాలించడంతోపాటు బంధువులు, తెలిసిన వారికి ఫోన్ చేసినా ఫలితంలేదన్నారు. దీంతో శనివారం టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

బత్తలపల్లి : ప్రజల నుంచి సేకరించి అక్రమంగా ఐచర్ ద్వారా కర్ణాటకు తరలిస్తున్న 171 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని జిల్లా విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శనివారం పట్టుకున్నారు. అనంతపురం విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీఎస్పీ జి.వీరరాఘవరెడ్డి తెలిపిన వివరాల మేరకు.. జిల్లా విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌ఛార్జి ఎస్పీ బి.ఉమామహేశ్వర ఆదేశాల మేరకు డీఎస్పీ వీరరాఘవరెడ్డి పర్యవేక్షణలో ఎస్ఐ బాలకృష్ణయ్య, ఎఇఇ కుళాయిరెడ్డి, సిబ్బంది, బత్తలపల్లి సిఎస్‌డిటి శారద కలిసి పక్కాగా అందిన సమాచారం మేరకు శనివారం ఉదయం 5 గంటలకు అనంతపురం-కదిరి జాతీయ రహదారిపై మండల పరిధిలోని తంటాపురం క్రాస్ వద్ద ఐచర్‌లో తరలిస్తున్న బియ్యాన్ని పట్టుకోవడంతోపాటు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. 171 క్వింటాళ్ల బియ్యాన్ని సీజ్ చేసినట్లు తెలిపారు. ముంచేమురుగు నాగరాజు, ధర్మవరానికి చెందిన సూరీ కలిసి ప్రజల నుంచి సేకరించిన బియ్యాన్ని ఐచర్‌లో తరలిస్తున్నట్లు విచారణలో తేలిందన్నారు. బియ్యంతోపాటు రాప్తాడుకు చెందిన డ్రైవర్ నరసింహులును అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినటు తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

రొద్దం : పాముకాటుకు గురై ఆసుపత్రితో చికిత్స పొందుతూ యువకుడు మృతిచెందిన ఘటన శనివారం మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని శేషపురం గ్రామానికి చెందిన ఉప్పర రవి (30) గత సోమవారం పొలం పనులకు వెళ్లాడు. అక్కడ పాము కాటు వేయడంతో వెంటనే కుటుంబ సభ్యులు హిందూపురం తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం అనంతపురం, అక్కడ నుంచి కదిరి, అక్కడ నుంచి బంగళూరు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు గ్రామస్థులు తెలపారు. మృతుడికి భార్య సునీత, కుమార్తె ఉన్నారు. ఆసుపత్రిలో వైద్యం కోసమే సుమారు రూ.2.50లక్షలు ఖర్చు అయిందన్నారు. అంతేగాకుండా కుటుంబ పెద్దను కోల్పోవడంతో నిరాశ్రయులమయ్యామని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

దుకాణంలో చోరీ

ధర్మవరం టౌన్ : పట్టణంలోని టీవీఎస్ షోరూం వద్ద ఉన్న టింకర్ దుకాణంలో శుక్రవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. బాధితుడు షేక్షా తెలిపిన వివరాల మేరకు..రాత్రి దుకాణానికి తాళం వేసి ఇంటికి వెళ్లి శనివారం ఉదయం వచ్చి చూడగా చోరీ జరిగినట్లు గుర్తించామన్నారు. గుర్తు తెలియని దుండగులు దుకాణం వెనుకవైపు ఉన్న రేకును తొలగించి షాపులోకి ప్రవేశించి సామగ్రి, వస్తువులు దొంగతనం చేసినట్లు తెలిపారు. వెంటనే వన్‌టౌన్ పోలీసులకు సమాచారం అందివ్వగా పోలీసులు వచ్చి ఘటనా స్థలాన్ని పరిశీలించినట్లు తెలిపారు. చోరీకి గురైన వస్తువుల విలువ సుమారు రూ.70వేలు ఉంటుందన్నారు. బాధితుడు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దొంగల కోసం గాలిస్తున్నారు.

విఆర్ఓ కుటుంబానికి ఆర్థికసాయం

మృతురాలి భార్యకు చెక్కు అందిస్తున్న తహశీల్దార్ సౌజన్యలక్ష్మి

పరిగి : మండలంలోని బీచిగానిపల్లి గ్రామానికి చెందిన వీఆర్ఏ గంగాధరప్ప (53) శనివారం మృతిచెందడంతో రెవెన్యూ సిబ్బంది ఆర్థికసాయం అందజేశారు. ముందుగా విషయం తెలుసుకున్న తహశీల్దార్ సౌజన్యలక్ష్మి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు ప్రగాడ సానుభూతి తెలిపారు. అనంతరం తక్షణ సాయం కింద రూ.15వేల చెక్కును భార్యకు అందించారు. రానున్న రోజుల్లో కూడా కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ నరసింహం, విఆర్ఓ నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

వెంగళమ్మ చెరువులో 'పొలంబడి'

పుట్టపర్తి రూరల్ : మండల పరిధిలోని వెంగళమ్మచెరువు గ్రామంలో రైతు ఈశ్వర్‌రెడ్డికి చెందిన వరి పంటలో శనివారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ అధికారులు సాగుపై రైతులకు రైతులకు అవగాహన కల్పించారు. పర్యావరణానికి హాని కలగకుండా, తక్కువ పెట్టుబడితో, అధిక దిగుబడులు సాధించడమే పొలంబడి ముఖ్య ఉద్దేశమని రైతులకు సూచించారు. రైతులు సాధారణ పద్ధతిలో జింక్ సల్ఫేట్ వాడరన్నారు. విత్తన శుద్ధి చేయకపోవడం, ముదురు నారు నాటడం, యూరియా ఎక్కువగా వాడడం, అధిక పురుగు మందులు వాడడం ఇలాంటి కార్యక్రమాలతో రైతులకు పెట్టుబడి ఖర్చులు పెరిగి దిగుబడి తగ్గి నష్టపోతారన్నారు. వరి పంట చిరు పొట్ట దశలో పొటాస్ ఎకరాకు 30 కిలోలు వేయడం వల్ల రోగ నిరోధక శక్తి పెరిగి, ఎండకు తెగులు రాకుండా గింజ నాణ్యత ఉంటుందన్నారు. వరి నాటిన తర్వాత 30 రోజులు వరకు రెండు సెంటీమీటర్లు నీరు మాత్రమే పొలంలో ఉండే విధంగా చూసుకోవాలన్నారు. తద్వారా ఖర్చులు తగ్గి.. దిగుబడి పెరిగి ఆశించిన ఆదాయం వస్తుందని సూచించారు. ఈకార్యక్రమంలో జిల్లా వ్యవసాయ పనుల కేంద్రం నుంచి ఎడిఎ సనావుల్లా, ఎఒ శశిధర్‌రెడ్డి, పుట్టపర్తి ఎఒ వెంకటబ్రహ్మం, ఎఇఒ ఆనందనాయక్, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు బృందావని, సురేష్ పాల్గొన్నారు.

కబడ్డీ పోటీల్లో జిల్లాఖ్యాతిని చాటాలి

బత్తలపల్లి : విశాఖపట్టణం జిల్లాలో నిర్వహించే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో రాణించి అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల ఖ్యాతిని చాటాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. శనివారం బత్తలపల్లిలోని ఆర్డీటీ క్రీడా మైదానంలో సీనియర్స్ విభాగంలో మహిళలు, పురుషుల కబడ్డీ జట్లను ఎంపిక చేశారు. ఎంపిక ప్రక్రియకు జిల్లా నలుమూలల నుంచి వివిధ ప్రాంతాలకు చెందిన క్రీడాకారులు హాజరయ్యారు. పురుషుల విభాగంలో 60 మంది మహిళల విభాగంలో 40 మంది పాల్గొన్నారు. క్రీడాకారులకు కబడ్డీ పోటీలను నిర్వహించారు. అందులో బాగా రాణించిన వారిని ఎంపిక చేశారు. ఎంపికైన వారు ఈ నెల 25వ తేదీ నుంచి 27వ తేదీ వరకు విశాఖపట్టణం జిల్లా అంకుపాళ్యంలో 70వ రాష్ట్రస్థాయి మహిళం, పురుషుల కబడ్డీ పోటీలకు జిల్లాజట్టుకు ప్రాతినిథ్యం వహిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డి ప్రమీల, ఆర్డీటీ ఎటిఎల్ కుణ్యాంగం, అనంతపురం జిల్లా కబడ్డీ సంఘం ప్రెసిడెంట్ హరినాథ్‌గౌడ్, వైస్ ప్రెసిడెంట్ సంపత్‌కుమార్, మంజుల వెంకటేష్, కార్యదర్శి దాగిరి రామయ్య, సెక్షన్ కమిటీ నరసింహులు, అశ్విని పలువురు సిబ్బంది, క్రీడాకారులు పాల్గొన్నారు.